సాక్షి
పెద్దపల్లి
సోమవారం ၊ 6 ၊ ఫిబ్రవరి ၊ 2023



జోరుగా మట్టి దందా
అక్రమార్కులు ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లోని మొరం, మట్టిని అక్రమంగా తరలిస్తూ సర్కారు ఆదాయానికి గండి కొడుతున్నారు. 8లో▶



'గుర్తింపు'పై దూకుడు
సింగరేణిలో గుర్తింపు ఎన్నికలపై పోరాటానికి కార్మిక సంఘాలు సిద్ధం అవుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. 8లో▶

గరిష్ఠం/కనిష్ఠం
31.8 /15.0

వాతావరణం
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండవేడి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో చోటు



కవితకు రికార్డు పత్రాలు అందిస్తున్న సురేశ్

యైటింక్లయిన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 44వ పుట్టిన రోజు సందర్భంగా జాగృతి రాష్ట్ర కార్యదర్శి కండెం సురేశ్ యైటింక్లయిన్‌కాలనీలో 44 రకాల కార్యక్రమాలు నిర్వహించారు. ఇది తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులోకి చేరింది. రికార్డుకు సంబంధించిన పత్రాలను సురేశ్ కవితకు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఆదివారం అందించారు. ఆయన వెంట శ్రీధర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నందిమేడారం పంప్‌హౌజ్ అద్భుతం



పంప్‌హౌజ్‌లో పర్యటిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

ధర్మారం: మండలంలోని నందిమేడారం పంప్‌హౌజ్ నిర్మాణం అద్భుతమని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్‌భూయాన్ అన్నారు. కోర్టు ప్రారంభం అనంతరం ఆయన గ్రామంలో పర్యటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఆరో ప్యాకేజీ నంది పంప్‌హౌజ్‌ను సందర్శించారు. ప్రాజెక్టు గురించి ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఈఈ శ్రీధర్ న్యాయమూర్తికి వివరించారు. పంప్‌హౌజ్ అండర్‌గ్రౌండ్ సర్జ్‌పూల్, సబ్‌స్టేషన్, డెలివరీ సిస్టమ్‌ను పరిశీలించారు. అండర్‌గ్రౌండ్‌లోకి వస్తే మరోలోకాన్ని చూసినట్లు ఉందన్నారు.

హాథ్‌సే హాత్ జోడోను విజయవంతం చేయాలి



నాయకులు మల్లురవి, బలరాంనాయక్ తదితరులతో సీతక్క, విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో సోమవారం నుంచి మొదలయ్యే హాథ్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. ములుగు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు మల్లు రవి, బలరాం నాయక్, సిరిసిల్ల రాజయ్య, గండ్ర సత్యనారాయణరావు, అశోక్, రవళిరెడ్డి తదితరులను విజయరమణారావు కలిశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా యాత్ర నిర్వహణ బాధ్యతలను పార్టీ అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల పేరిట మోసం

జ్యోతినగర్: రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉద్యోగాల కల్పన కోసం దళారులు తమకు అందినకాడికి దండుకుంటున్న వైనం తేటతెల్లం అవుతోంది. ఉద్యోగాలు కల్పిస్తామని ఓ వ్యక్తి మధ్యవర్తిగా ఉండి ప్రభుత్వ ఉద్యోగితోపాటు ఆమె భర్తకు సుమారు 9 మంది వ్యక్తుల నుంచి రూ.15.20లక్షలు ఇప్పించినట్లు సమాచారం. ఏడాది దాటినా ఉద్యోగం కల్పించకపోవడంతో బాధితులు మధ్యవర్తిని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో సదరు వ్యక్తి ఎవరి డబ్బులు వారికి తిరిగి ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగి, ఆమె భర్తకు సూచించినా తిరకాసు పెడుతున్నట్లు సమాచారం. దీంతో బాధితులు ఎన్టీపీసీ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఉద్యోగాలు వస్తాయని ఆశపడి అప్పు తెచ్చామని, తిరిగి చెల్లించేలా చూడాలని కోరారు.

న్యాయ వ్యవస్థపై విశ్వాసం కల్పించాలి

- న్యాయ సంరక్షణకు అందరూ కృషిచేయాలి
- జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో 16,465 కేసులు పెండింగ్
- కేసులు పరిష్కారానికి అందరూ సహకరించాలి
- 1013 కేసులు నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు..
- జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్



మాట్లాడుతున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్

సాక్షి, పెద్దపల్లి/ధర్మారం: న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించే దిశగా ప్రతిఒక్కరూ కృషిచేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. ధర్మారం మండలం నందిమేడారంలో ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆదివారం ప్రారంభించారు. ముందుగా వారికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు, కలెక్టర్ సంగీత, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.సురేశ్ బాబు న్యాయమూర్తులకు స్వాగతం పలికారు. పండితులు వేదమంత్రాల మధ్య పూర్ణ కుంభంతో ఆహ్వానించారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కోర్టును ప్రారంభించిన న్యాయమూర్తులు సర్వమత ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ భవిష్యత్‌లో కోర్టుల సంఖ్య పెంచేందుకు కృషిచేస్తామని, కోర్టుల్లో వసతుల కల్పనకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలన్నారు. తనకు తెలుగు భాష అంటే మక్కువని, చిన్నతనంలో నందమూరి తారకరామరావు ప్రసంగం వినేవాడినని, అదే సమయంలో ఆయన హిందీ భాష తీరును చూసి ఆశ్చర్యపోయేవాడినని గుర్తు చేశారు. కోర్టుల్లో వాడే భాష స్థానిక ప్రజలకు అర్థమయ్యేలా ఉంటే మరింత చేరువగా న్యాయవ్యవస్థ పని చేస్తుందని అభిప్రాయపడ్డారు. భాష కేవలం ఇతరులకు కమ్యూనికేట్ చేసే సాధనం మాత్రమేనని, దీనికి సంబంధించి గౌహతిలో జూనియర్ సెలక్షన్ కమిటీలో జరిగిన సంఘటనను వివరించారు. మంచి పరిజ్ఞానం ఉన్న జడ్జిలను తాను ఎంపిక చేశానని తెలిపారు. మారుమూల గ్రామమైన నందిమేడారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గర్వకారణమని, దీనివల్ల ప్రజలకు చేరువలోనే న్యాయం అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. హైకోర్టు జస్టిస్ పి.నవీన్‌రావుపై ఉన్న గౌరవంతో 14మంది హైకోర్టు జడ్జిలు వచ్చి ఇక్కడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించడం మరింత శోభ సంతరించుకుందని అన్నారు. జిల్లాలో రెండో శతాబ్దానికి చెందిన బౌద్ధ స్తూపాలు, ఓదెల మల్లికార్జునస్వామి, కమాన్‌పూర్‌లో శ్రీఆదివరాహస్వామి ఆలయం, రామగిరి ఖిల్లా వంటి ప్రాంతాలు ఉన్నాయని గుర్తు చేశారు.



జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

16,465 కేసులు పెండింగ్..

జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో 16,465 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని న్యాయమూర్తి భూయాన్ తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి వసతులు కల్పించడంతోపాటు నూతన కోర్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, న్యాయవాదులు, ప్రజలు సహకరించాలని కోరారు. నందిమేడారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని త్వరగా పూర్తిచేసేందుకు సహకరించిన కలెక్టర్, అధికార యంత్రానికి అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, జడ్జిలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ సెక్రటరీ భాస్కర్, ప్రజాప్రతినిధులు, న్యాయ అధికారులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. కోర్టు ప్రారంభోత్సవం అనంతరం జడ్జిల బృందం కాళేశ్వరం ప్రాజెక్టులోని నందిమేడారం అండర్ టన్నెల్‌ను సందర్శించారు.

ప్రతిఒక్కరూ సహకరించాలి



నా సొంత గ్రామంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చాలా సంతోషంగా ఉంది. కోర్టులో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఒక్కో కేసు 20 నుంచి 30 ఏళ్లపాటు సాగడం ద్వారా ఎవరికీ న్యాయం జరగదు. ప్రతి వెయ్యి కేసులకు ఒక్క కోర్టు ఉంటే బాగుంటుంది.

– హైకోర్టు జడ్జి జస్టిస్ నవీన్‌రావు

గృహ ప్రవేశానికి వచ్చినట్లుంది



నంది మేడారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధికి 281 సివిల్ కేసులు, 732 క్రిమినల్ కేసులు మొత్తం 1013 కేసులు బదిలీ చేశాం. గ్రామస్థాయిలో కోర్టుల ఏర్పాటుతో ప్రజలకు సత్వర న్యాయం అందే అవకాశం ఉంది. కోర్టు ప్రారంభానికి కాకుండా మా ఇంటి గృహప్రవేశానికి వచ్చినట్లు ఉంది.

– ఎస్వీ.శ్రవణ్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి

మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ



పట్నాలు వేస్తున్న ఒగ్గుపూజారులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గుపూజారులతో పట్నాలు వేశారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

సదయ్య గౌడ్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సదయ్య గౌడ్

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన ఏగోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఏగోలపు సదయ్య గౌడ్‌కు గ్లోబల్‌హ్యూమన్ పీస్ యూనివర్సిటీ చైర్మన్ భారత్ సవిక్ సమాజ్ గౌరవ డాక్టరేట్ అందించారు. తమిళనాడు రాష్ట్రంలోని ఊటీలో రిసోర్స్ సెంటర్ ఫర్ ట్రైబల్ కల్చర్ సోషల్ లీడర్ కాన్ఫరెన్స్–2023 కార్యక్రమంలో డాక్టరేట్ అందించారు. కరోనా సమయంలో పలువురిని ఆదుకోవడమే కాకుండా సామాజిక సేవలో ముందుండి నడిపిస్తున్నందుకు ఈ డాక్టరేట్ అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సంపత్ కుమార్ హాకీం ఉన్నారు. 18ఏళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్‌కు ఎంపిక చేసినందుకు సదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

సకుటుంబ సపరివారంగా..!

- పోరుబాటలో రెండో ఏఎన్‌ఎంలు
- ఈనెల 9న అసెంబ్లీ ముట్టడికి పిలుపు
- కుటుంబ సభ్యులతో రావాలని వినతి



మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఇటీవల వినతిపత్రం ఇస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

సుల్తానాబాద్: రెండో ఏఎన్‌ఎంలు పోరుబాట ఎంచుకున్నారు. తమను రెగ్యులర్ చేయాలని, పనికి తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 9న కుటుంబసమేతంగా అసెంబ్లీని ముట్టడించాలని నిర్ణయించారు. ఇప్పటికే తమ సమస్యలను అధికార పార్టీతోపాటు ప్రతిపక్షాలకూ వినతిపత్రాలు అందించారు. అసెంబ్లీలో చర్చ జరిగేలా చూడాలని విన్నవించారు. డీఎస్సీ ద్వారా సెలక్షన్ అయిన తమను రెగ్యులర్ చేస్తారని భావిస్తూ పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 16 ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని పేర్కొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి తీర్మానం..

గతనెల 12న హైదరాబాద్‌లో శాంతియుత నిరసనలు చేపట్టినప్పటికీ పాలకుల్లో చలనం రాకపోవడంతో రెండో ఏఎన్‌ఎంలు వారి కుటుంబ సభ్యులతో కలిసి అసెంబ్లీని ముట్టడించాలని నిర్ణయించారు. సమస్యలను అసెంబ్లీలో చర్చించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికే అసెంబ్లీ ముట్టడికి తీర్మానం చేశామని ఏఐటీయూసీ అనుబంధం ఏఎన్‌ఎం యూనియన్ సభ్యులు తెలిపారు.

కరోనా కష్టకాలంలో సేవలు

కరోనా కష్టకాలంలో రెండో ఏఎన్‌ఎంల సేవలను ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రశంసించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి మందులు పంపిణీ చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. వ్యాక్సిన్ సమయంలోనూ చురుకుగా పాల్గొన్నారు. ఆ సమయంలో కరోనా బారిన పడి కొందరు మృత్యువాత పడ్డారు కూడా. వైరస్ సోకి చివరి అంచుల వరకు వెళ్లి వచ్చిన ఏఎన్‌ఎంలు సైతం ఉన్నారు. అయితే హెల్త్ కార్డు లేకపోవడంతో అప్పు చేసి ప్రాణాలు కాపాడుకున్నారే తప్ప ప్రభుత్వం ఎంతమాత్రమూ ఆదుకోలేదనేది వీరి వాదన. ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయడం లేదని మనోవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిశు సంరక్షణకే విధులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండో ఏఎన్‌ఎంలు మాతాశిశు సంరక్షణ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలతో పాటు ఇమునైజేషన్ చేయాల్సి ఉంటుంది. సాధారణ ప్రసవం, తల్లీబిడ్డ క్షేమంగా ఉండేలా సూచనలు, సలహాలు ఇవ్వడం వీరి బాధ్యత. కానీ ప్రభుత్వం మాత్రం ఇటీవల ఫీవర్ సర్వే బాధ్యతలు అప్పగించింది. క్రమంగా సర్వేతోపాటు ఐహెచ్‌ఐపీ, ఈ–సంజీవని చేయాలని నిబంధన విధించారు. వీటితోపాటు కేఆర్ కిట్, ఎన్సీడీ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పరీక్షలు, మందుల పంపిణీ, టీబీ, క్యాన్సర్, పక్షవాతం, వృద్ధులకు అలనా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బలహీనంగా ఉన్న గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు సైతం అందించేలా సర్కారు బాధ్యతలు అప్పగించింది. వీటికితోడు కంటివెలుగు కార్యక్రమంలో పాల్గొని బాధితుల పేర్లను ఆన్‌లైన్ చేసే బాధ్యతలు అప్పగించింది.

డిమాండ్లు ఇవీ..

- నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను జీవో నంబర్ 16లో చేర్చి పర్మినెంట్ చేయాలి.
- కంటి వెలుగులో పాల్గొన్నవారికి టీఏ, డీఏ ఇవ్వాలి.
- గ్రామీణ, అర్బన్ వెనుకబడిన, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్నందున రూ.5000 రిస్క్ అలవెన్స్ ప్రకటించాలి.
- కోవిడ్ సమయంలో టీకావేసినందుకు రూ.15 చొప్పున ఇన్సెంటివ్ చెల్లించాలి.
- 35 రోజులు ఐచ్ఛిక సెలవులు ఇవ్వాలి.
- డీఎస్సీలో సెలక్షన్ అయిన వారిని షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలి.
- ఖాళీగా ఏఎన్‌ఎం పోస్టులను భర్తీ చేయాలి.

రెగ్యులర్ చేయాల్సిందే..



16 ఏళ్లుగా పనిచేస్తున్నాం. డీఎస్సీ ద్వారా ఎంపికైన వారిని రెగ్యులర్ చేయాలి. ఒకే శాఖలో పనిచేస్తున్న కొందరిని చేసి ఇంకొందరిని చేయకపోవడం సరికాదు. కరోనా కాలంలో ప్రజలకు సేవ చేశాం. కొందరు చనిపోయారు కూడా. మాకు న్యాయం చేయాలి.

– పదాల మమత, రెండో ఏఎన్‌ఎం అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

అన్ని పనులూ మాకే..



ప్రభుత్వం కొత్త పథకాలు ప్రవేశపెడుతున్న ప్రతిసారీ మా సేవలను వినియోగించుకుంటోంది. పదో తరగతి చదివిన వారు ఉన్నారు. అలాంటి వారికి ఆన్‌లైన్ చేయడం కష్టంగానే ఉంది. ప్రభుత్వం రెగ్యులర్ చేస్తామని చెప్పి మాట తప్పింది. ఈనెల 9న అసెంబ్లీ ముట్టడిస్తాం.

– గాండ్ల మధురిమ, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పేదల అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్సీ భానుప్రసాదరావు, ఎమ్మెల్యే దాసరి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



దుకాణసముదాయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ఎలిగేడు: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తోందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాదరావు, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఎలిగేడు సింగిల్‌విండో ఆధ్వర్యంలో మండలంలోని శివపల్లిలో నిర్మించిన గోదాం, ధూళికట్ట గ్రామ పంచాయతీ నిర్మించిన దుకాణసముదాయాలు, శ్రీలక్ష్మీప్రసన్న వీవో పరిధిలో వ్యవసాయ పరికరాలు, యంత్రాల అద్దె కేంద్రం, ధూళికట్టలో ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, మండల కో–ఆప్షన్ సభ్యులు ఎండీ.ఖలీల్, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మాడ కొండాల్‌రెడ్డి, సర్పంచులు గొల్లె కావేరి, దుగ్యాల శ్వేత, ఎంపీటీసీలు, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ నరినేని సుధాకర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మంథనికి రైలు కూత..!

- రామగుండం–మణుగూరు లైన్‌కు రూ.10 కోట్లు
- ఊసులేని నిజామాబాద్ లైన్ పొడిగింపు

మంథని: బొగ్గు రవాణాకు కోల్ కారిడార్‌ను కలిపేందుకు వీలుగా ప్రతిపాదించిన రామగుండం – మణుగూర్‌కు రైల్వేలైన్‌కు కేంద్రం ఇటీవలి బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించింది. దీంతో చాలాకాలంగా ఎదురుచూస్తున్న మంథని ప్రజలకు త్వరలోనే రైలు కూత వినిపించే అవకాశముందని ఈ ప్రాంత వాసుల్లో వ్యక్తమవుతోంది.

రామగుండం వయా మంథని టూ మణుగూరు


రామగుండం, మంథనితోపాటు జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్ల, భూపాలపల్లి, ములుగు మీదుగా మణుగూరుకు 192 కిలోమీటర్ల రైల్వేలైన్‌కు ప్రతిపాదనలు చేశారు. లైన్ పూర్తి కావడానికి సుమారు రూ.4వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. విడతల వారీగా నిర్మించేలా ప్రణాళిక కూడా సిద్ధం చేశారు. తాజాగా ప్రకటించిన నిధులతో సింగరేణి గనులు విస్తరించి ఉన్న జిల్లాల మీదుగా రైల్వే లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. బొగ్గు రవాణాతోపాటు ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే లైన్ ప్రతిపాదించారు.

పెండింగ్‌లోనే నిజామాబాద్ లైన్

పీవీ.నరసింహారావు ప్రధానిగా ఉన్న 1991లో మంజూరైన పెద్దపల్లి–నిజామాబాద్ రైల్వేలైన్ ముందుకు సాగడం లేదు. 32ఏళ్ల క్రితం లైన్ మంథని వరకు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ అయినా కార్యరూపం దాల్చలేదు. పెద్దపల్లి నుంచి మంథని వరకు 33 కిలోమీటర్ల మేర లైన్‌తోపాటు వంతెనలు, ప్లాట్‌ఫాంల నిర్మాణానికి సర్వే చేశారు. మంథని పాత పెట్రోల్ బంక్ వెనుక నాలుగు ప్లాట్‌ఫాంతో రైల్వే స్టేషన్‌తోపాటు రామగిరి మండలం కల్వచర్ల వద్ద బ్రిడ్జి, పెద్దపల్లి – మంథని మార్గంలో నాలుగు కల్వర్టుల నిర్మాణానికి సర్వే నిర్వహించి ల్యాండ్‌మార్కింగ్ చేశారు. అప్పటి కేంద్ర ప్రణాళిక సంఘం అధ్యక్షుడు ప్రణబ్ ముఖర్జీ సర్వే కోసం నిధులు మంజూరు చేశారు. సర్వే నివేదిక కేంద్రానికి వెళ్లింది. ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో పెండింగ్‌లో పడింది. ఈ క్రమంలో కొన్ని నిధులు ప్రకటించకపోవడంతో ఆశలు ఆవిరి అవుతున్నాయి.

బీ–థర్మల్ జీవితకాలం పొడిగింపు..!

- విద్యుత్ శాఖ సీఈఏ నివేదిక..
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం



బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం

రామగుండం: రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కాలం చెల్లిన విద్యుత్ కేంద్రాలను పునరుద్ధరించేందుకు.. వీలైతే ఆధునీకరణకు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 20న ఆయా రాష్ట్రాల విద్యుత్ సంస్థల ప్రతినిధులకు లేఖలు రాసింది. ఈ నిర్ణయంతో రామగుండంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం జీవితకాలం మరింత పెరగనుంది. ఇక్కడి బీ–థర్మల్‌ను 1965 జూలై 19న అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఆధునిక విద్యుత్ కేంద్రాలతో పోటీపడుతూ.. స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ.. తక్కువ ధరకే విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఈ క్రమంలో అనేక రికార్డులను కైవసం చేసుకుంటోంది. అయినప్పటికీ 50 ఏళ్లు దాటిపోవడంతో కాలం చెల్లిన కేంద్రాల జాబితాలో చేరింది. ఫలితంగా తరచూ సాంకేతిక లోపాలు వస్తున్నాయి. యంత్రాల విడి భాగాలు లభ్యం కాకపోవడంతో శాశ్వత పరిష్కారం లభించడం లేదు. ఇలాంటి తరుణంలోనూ రికార్డులు సాధించిన పాత విద్యుత్ కేంద్రాలపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించి వాటికి నిధులు కేటాయిస్తూ జీవం పోస్తోంది. కేంద్ర మంత్రిత్వశాఖ ఉత్తర్వులపై బీ–థర్మల్ కేంద్రం అధికారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



సార్ బదిలీ అయ్యారు.. పిల్లలను పనిలోకి మళ్లించారు..!



ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లలకు చదువు తప్పనిసరి చేస్తూ.. ఆపరేషన్ ధృవ పేరిట పాఠశాలలు ప్రారంభించారు అప్పటి డీసీపీ రూపేశ్. జిల్లావ్యాప్తంగా ఉన్న ఇటుకబట్టీల్లో బ్రిక్ స్కూళ్లను ఏర్పాటు చేశారు. ఆయన ఇటీవల బదిలీ కావడంతో జిల్లాకేంద్రం శివారు గౌరెడ్డిపేట ఇటుక బట్టీల యజమానులు ఎప్పటిలాగే పిల్లలతో పనులు చేయిస్తున్నారు. పోలీసు అధికారులు వీటిపై దృష్టి పెట్టి చిన్నారులకు చదువు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు పిల్లలను చూసినవారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

108లో ఉద్యోగ అవకాశాలు

కోల్‌సిటీ(రామగుండం): 108 వాహనాలపై అత్యవస సేవలందించడానికి ఈఎంటీ, పైలట్ పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కరీంనగర్ ఉమ్మడి జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ సలీం ప్రకటనలో తెలిపారు. ఈఎంటీ ఉద్యోగానికి సైన్స్ గ్రూప్‌లో డిగ్రీ (డిప్లొమా ఇన్ ఈఎంటీ, బీఎస్సీ(బీజెడ్సీ), బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బీ ఫార్మా, డీ ఫార్మాతోపాటు ఇతర పారమెడికల్ కోర్సు) చేసిన 30 సంవత్సరాలలోపు ఉన్న వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి ట్రైనింగ్ ఫీజు రూ.45,000, శిక్షణ కాలం 60 రోజులు ఉంటుందన్నారు. స్థూల జీతం రూ.12,195. ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి శిక్షణ ప్రారంభమవుతాయన్నారు. అలాగే పైలట్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, 30 సంవత్సరాలలోపు ఉన్నవారు అర్హులన్నారు. శిక్షణ ఫీజు రూ.15,000, శిక్షణ కాలం 10 రోజులు, స్థూల జీతం రూ.12,195 ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 7న పెద్దపల్లి 108 జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని, వివరాలకు 73309 65815 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అనారోగ్యంతో రిటైర్డ్ హెచ్ఎం మృతి


నందిరెడ్డి(ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని కొలనూర్ హైస్కూలులో పనిచేసి రిటైర్డు అయిన ప్రధానోపాధ్యాయుడు అన్నాడి నందిరెడ్డి(89) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన నందిరెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్, మొట్లపల్లి, కొలనూర్, పెగడపల్లి గ్రామాల్లోని హైస్కూళ్లలో హెచ్ఎంగా పనిచేశారు. నందిరెడ్డి మృతిపట్ల పూర్వ విద్యార్థులు జీగురు ఐలయ్య, మాటూరి రత్నం, బాలసాని శ్రీనివాస్, చంద్రశేఖర్‌శర్మ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

రాములపల్లిలో కాలువకు గండి


కాలువకు పడిన గండి

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని రాములపల్లి శివారులో 10ఎల్ కాలువకు శనివారం రాత్రి గండిపడడంతో కాలువ కిందనున్న వరి పొలాలు నీటమునిగాయి. పొలాల్లో ఇసుకమేటలు వేసి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులకు రైతులు సమాచారం అందించగా, గండిపడిన చోట తాత్కాలికంగా ఇసుక బస్తాలను అడ్డుగా వేసి కాలువ నీరు పంట పొలాలకు వెళ్లకుండా సరిచేశారు. ఇదే కెనాల్‌కు కల్వర్టు వద్ద పైపులు వేయడంతో నీరు సక్రమంగా వెళ్లక ఒకే చోట భారీగా చేరి కెనాల్‌కు గండిపడినట్లు పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన భాగోతం బుజ్జమ్మ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి జాతరకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. 108 వాహనానికి సమాచారం అందించగా, ఈఎమ్‌టీ సతీశ్‌రెడ్డి ప్రథమ చికిత్స చేసి హుజురాబాద్ ఆస్పత్రికి తరలించారు.


కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు


స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


ధ్వజస్తంభం వద్ద మొక్కులు

పోటెత్తిన కొత్తగట్టు

శంకరపట్నం(మానకొండూర్): శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి పౌర్ణమి జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20వేల మంది తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. గుట్టపైకి వాహనాలను అనుమతించకపోవడంతో వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు ఘాట్‌రోడ్డు మీదుగా గుట్టపైకి చేరేందుకు టికెట్‌లు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. హుజూరాబాద్ రూరల్ సీఐ జనార్దన్, ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మలహాల్ రావు, ఈవో సుధాకర్, సర్పంచ్ కిషన్‌రావు, ధర్మకర్తలు, అర్చకులు శేషం మురళీధరాచార్యులు, మాధవాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జోరుగా మట్టి దందా

- రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి


సుల్తానాబాద్ మండల పరిధిలో మట్టి అక్రమ రవాణా

సుల్తానాబాద్(పెద్దపల్లి): అక్రమార్కులు ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లోని మొరం, మట్టిని అక్రమంగా తరలిస్తూ సర్కారు ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇటీవల ఓదెల మండలం కొలనూరు గ్రామంలో అక్రమ మొరం తవ్వకాలను అడ్డుకోవాలని రెవెన్యూ, గనులశాఖ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు సంఘటితమై పొక్లెయిన్, వాహనాలను పట్టుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దీంతోపాటు స్థానిక ప్రజాప్రతినిధిని పొక్లెయిన్ యజమాని దుర్భాషలాడడంతో అట్రాసిటి కేసు నమోదయిన విషయం తెలిసిందే.

నిబంధనల ప్రకారం ఇలా..

ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలకు మట్టి కావాలంటే భూగర్భ గనులశాఖ అనుమతి తప్పనిసరి. దీనికి ముందుగా రెవెన్యూ అధికారులు నిరభ్యంతర పత్రం ఇవ్వాలి. ఎంత మేరకు అవసరం.? ఎక్కడి నుంచి.. ఎటు తీసుకెళ్తారనేది స్పష్టం చేయాలి. సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే మట్టిని తరలించాలి. కాని ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటుక బట్టీల కోసం తాత్కాలికంగా చెరువులు, కుంటల నుంచి మట్టి తీసుకునేందుకు అనుమతి పొందారే తప్ప గ్రావెల్ క్వారీ కోసం అనుమతులకు దరఖాస్తులు చేసుకోలేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

రాత్రి వేళ రవాణా..

జిల్లా కేంద్రం సమీప ప్రాంతాలతో పాటు సుల్తానాబాద్, ఎలిగేడు, ఓదెల, శ్రీరాంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లోని గుట్టలు, అసైన్మెంట్ భూముల నుంచి అక్రమంగా రాత్రి వేళలో మట్టిని లారీల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వెంచర్లలో మట్టి పోసుకునేందుకు అధికారుల కళ్లుగప్పి రాత్రి వేళలో టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ప్రభుత్వ అభివృద్ధి పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఆయా బల్దియాలకు సమీపంలో రియల్ వెంచర్లు భారీగా వెలుస్తున్నాయి. వీటన్నింటికీ అక్రమంగానే మట్టి తరలిస్తుండటం గమనార్హం. ఓ మండల స్థాయి అధికారి అండదండలతోనే అక్రమ దందా జోరుగా సాగుతోందనే విమర్శలున్నాయి.

ఎక్కడా అనుమతుల్లేవు

జిల్లాలో మట్టి క్వారీలకు ఎక్కడా అనుమతులు ఇవ్వలేదు. స్థానికంగా రెవెన్యూ అధికారులే ఇస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ అవసరాలకు తవ్వినా మా అనుమతి తప్పనిసరి. ప్రైవేటు భూముల నుంచి తవ్వకాలు జరిపినా నిబంధన వర్తిస్తుంది. తనిఖీల్లో పట్టుబడితే జరిమానా వేస్తున్నాం. అక్రమ మట్టి తవ్వకాలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. – సాయినాథ్, జిల్లా భూగర్భ గనులశాఖ అధికారి

కరెంటు స్తంభం విరిగిపడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి

- భూమి చదును చేస్తుండగా ఘటన
- పరిహారం కోసం ట్రాక్టర్ యజమాని ఇంటివద్ద మృతదేహంతో ఆందోళన


సంతోష్ (ఫైల్)


ట్రాక్టర్‌పై సంతోష్ మృతదేహం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ధర్మారంరోడ్ (తెనుగువాడ)లో భూమిని ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా ఖాళీగా ఉన్న విద్యుత్ స్తంభానికి తగిలి అది విరిగిపడడంతో ట్రాక్టర్ నడుపుతున్న చిటవేన సంతోష్ (32) అక్కడికక్కడే మరణించాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి శివారుగ్రామం బందంపల్లికి చెందిన చిటవేన సంతోష్ ఏడాది కాలంగా పెద్దపల్లిలోని తెనుగువాడకు చెందిన బూతగడ్డ సారయ్య ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి అదే వాడకు చెందిన నక్క రమేశ్, నక్క శ్రీనివాస్‌కు చెందిన భూమిని చదును చేస్తుండగా వృథాగ ఉన్న విద్యుత్ స్తంభానికి తగలడంతో ఆ పోల్ విరిగి డ్రైవర్‌పైనే పడింది. తీవ్రరక్తస్రావం కావడంతో సంతోష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రజిత, పిల్లలు మణిదీప్, సహస్ర ఉన్నారు.

పరిహారం కోసం ఆందోళన

రాత్రి సమయంలో పనులు చేయించి ప్రాణాలు పోయేందుకు కారణమయ్యారంటూ మృతుడు సంతోష్ బంధువులు పెద్దసంఖ్యలో ట్రాక్టర్ యజమాని సారయ్య ఇంటికి చేరుకుని వాగ్వాదానికి దిగారు. సంతోష్ మరణంతో అతడి కుటుంబానికి ఏ దిక్కు లేకుండా పోయిందని పరిహారం ఇచ్చి ఆదుకోవాలంటూ డిమాండ్ చేశారు. తాను ఏమీ ఇవ్వలేనంటూ ఇంటికి తాళం వేసి సారయ్య వెళ్లిపోవడంతో సంతోష్ మృతదేహాన్ని సారయ్య ఇంటిముందు ఉంచి ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న సీఐ ప్రదీప్‌కుమార్, బసంత్‌నగర్, సుల్తానాబాద్, పెద్దపల్లి ఎస్ఐలు శ్రీనివాస్, ఉపేందర్, రాజేశ్ తమ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాపం చిన్నారులు


సంతోష్ కూతురు,కొడుకు

ప్రమాదంలో కన్నుమూసిన సంతోష్‌కు ఏమైందో తెలియని అమాయకస్థితిలో ఉన్న చిన్నారులను చూసి స్థానికుల గుండె బరువెక్కింది. అభంశుభం తెలియని చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దే కుటుంబ యజమాని లేకపోవడంతో వారికి దిక్కెవరని రోదిస్తున్న తీరు పలువురిని కలచివేసింది. బందంపల్లికి చెందిన చిటవేన సంతోష్‌ది పేద కుటుంబం. సంతోష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా, భార్య రజిత వ్యవసాయ కూలీగా పనిచేస్తూ పిల్లలను పోషించుకుంటున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు భూ యజమాని, ట్రాక్టర్ యజమానులతో పరిహారం ఇప్పించేలా ప్రయత్నాలు సాగుతున్నాయని సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు కాలువలో బోల్తాపడి ఒకరి మృతి


కాలువలో బోల్తాపడ్డ కారు


మృతిచెందిన రిజ్వాన్

- మరో నలుగురికి గాయాలు
- రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది

జగిత్యాలక్రైమ్: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ రామాలయం వెనకాల గల ఎస్సారెస్పీ కాలువలో ఆదివారం రాత్రి కారు అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. పట్టణంలోని తులసినగర్ ప్రాంతంలో నివాసం ఉండే రిజ్వాన్(35), మరో నలుగురు స్నేహితులు కలిసి పని నిమిత్తం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం కారులో వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో ధరూర్ క్యాంపు సమీప ఎస్సారెస్పీ కాలువ వద్దకు రాగానే కారు అదుపు తప్పి అందులో పడిపోయింది. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఉన్న వారిని బయటకు తీశారు. ఆ వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వెళ్లాక రిజ్వాన్ మృతిచెందాడు. మిగిలిన నలుగురికి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడు ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


అరవింద్ మృతదేహం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి వీర్లపల్లి మూలమలుపు సింగరేణి చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి ఆర్టీసీ అద్దె బస్సు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో దాట్ల అరవింద్(26) అక్కడికక్కడే మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల వివరాలు.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట గ్రామానికి చెందిన అరవింద్ గోదావరిఖని విద్యానగర్‌లో బంధువుల ఇంట్లో నివాసం ఉంటూ సింగరేణి టూ ఇంక్‌లైన్ మైన్‌లో అప్రెంటిస్ ట్రైనింగ్ చేస్తున్నాడు. తన ద్విచక్ర వాహనంపై గోదావరిఖని వైపు వెళ్తుండగా, ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై శ్యామ్ పటేల్ తెలిపారు.

తిరుపతి స్మారక భవన్‌కు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న వెంకట్‌రెడ్డి తదితరులు

గోదావరిఖని(రామగుండం): ఉద్యమాలకు నిలయంగా సీపీఐ తిరుపతి భవన్ నిలుస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎల్‌బీనగర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ మార్కాపురి తిరుపతి స్మారక భవన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడారు. నిరంతర ప్రజా సమస్యల కోసం పోరాడి, కమ్యూనిస్టు పార్టీ పక్షాన మొదటిసారి కౌన్సిలర్‌గా ఎన్నికై అనేక సమస్యలు పరిష్కరించిన వ్యక్తి తిరుపతి అని కొనియాడారు. నిబద్ధతతో పోరాడి ఇంటిపేరునే సీపీఐ తిరుపతిగా మార్చుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని వివరించారు. తిరుపతి స్మారక భవన్ ఈప్రాంతంలో ప్రజలకు అండగా, ఉద్యమాలకు నిలయంగా మారాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు కె.కనకరాజ్, తాండ్ర సదానందం, గోసిక మోహన్, గౌతమ్ గోవర్ధన్, పల్లె నర్సింహా, కె.స్వామి, ఓదెమ్మ, మార్కపురి సూర్య, ఇనుముల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబ్లాకుల ప్రైవేటీకరణ నిలిపివేయాలి



సమావేశంలో నాయకులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో నాలుగు బ్లాకుల ప్రైవేటీకరణ నిలిపివేసి తిరిగి సంస్థకే కేటాయించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ జీఎల్‌బీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మహాసభల తీర్మానాలను వెల్లడించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో ప్రైవేటీకరణ నిలిపివేయాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ఈసందర్భంగా నూతన కమిటీ ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా టి.శ్రీనివాస్, అధ్యక్షుడిగా ఎండీ చాంద్ పాషా, ఉపాధ్యక్షులుగా ఈదునూరి నరేష్, పోతుల కిష్టయ్య, బి.అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఐ.కృష్ణ తదితరులను ఎన్నుకున్నారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- 18 తులాల బంగారం
- లక్ష నగదు అపహరణ


పరిశీలిస్తున్న పోలీసులు

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధి గౌడ్స్ వీధి ఆంజనేయస్వామి దేవాలయం ఎదురుగా తాళం వేసి ఉన్న ఓ ఇంటికి దొంగలు కన్నం వేసి భారీగా సొత్తు ఎత్తుకెళ్లారు. ఇంట్లో యజమానితోపాటు మరో ఇద్దరు అద్దెకు ఉంటున్నారు. వీరంతా ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. అదే అదునుగా భావించి దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఇంట్లో అద్దెకు ఉండే ఊరడి రాజు ఆదివారం ఊరి నుంచి రాగా.. గది తలుపులు తీసి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఇంటి యజమాని ఇందిరమ్మ, మరో అద్దెదారు అనూష గదుల తాళాలు సైతం పగులగొట్టి ఉన్నాయి. రాజు గదిలో ఎనిమిది తులాల బంగారం, మూడు వేల నగదు, అనూష ఇంట్లో పది తులాల బంగారం, రూ.80 వేల నగదు దొంగతనం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రధాన రహదారిలో ఉన్న ఇంట్లో దొంగతనం జరగడంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. దొంగతనం జరిగిన ఇంటిని పోలీసులు పరిశీలించారు. క్లూస్ టీం వస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. పూర్తిస్థాయి పరిశీలన అనంతరం వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

'గుర్తింపు'పై దూకుడు

- సింగరేణి ఎన్నికలపై తేల్చకుంటే మరో ఉద్యమానికి సిద్ధం
- ఈనెల 6న సీఎల్‌సీ ఎదుట భారీ ధర్నా
- 18లోగా నిర్ణయం తీసుకోకుంటే కోర్టు ధిక్కరణ కేసు
- మళ్లీ కోర్టుకెక్కుతాం: వాసిరెడ్డి సీతారామయ్య


సింగరేణి కార్మికులు

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు ఎన్నికలపై పోరాటానికి కార్మిక సంఘాలు సిద్ధం అవుతున్నాయి. గుర్తింపు ఎన్నికలు సాధ్యమైనంత త్వరగా నిర్వహించాలని ఏఐటీయూసీ యూనియన్ హైకోర్టును ఆశ్రయించింది. మూడునెలల్లో ఎన్నికలు నిర్వహించాలని సింగరేణి యాజమాన్యం, సీఎల్‌సీకి సూచించింది. కోర్టు నిర్దేశిత గడువు ఈనెల 18తో ముగియనుంది. గుర్తింపు ఎన్నికల జాప్యాన్ని నిరసిస్తూ ఇప్పటికే జాతీయ కార్మిక సంఘం ఏఐటీయూసీ చీఫ్ లేబర్‌కమిషనర్(సీఎల్‌సీ)ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఎన్నికలకు సంబంధించిన సన్నాహాలు చేపట్టామని, కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో ఆదేశాలు రాగానే ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తామని సీఎల్‌సీ అధికారులు వెల్లడించారు. అయితే నెలరోజులు గడిచినా ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడంతో సీఎల్‌సీ కార్యాలయం ఎదుట భారీధర్నాకు ఏఐటీయూసీ సిద్ధమైంది.

సీఎల్‌సీ కార్యాలయం ఎదుట ధర్నా

ఎన్నికలను సాధ్యమైనంత త్వరగా నిర్వహించాలని కోరుతూ హైదరాబాద్‌లోని సీఎల్‌సీ కార్యాలయం ఎదుట ఈనెల 6న భారీ ధర్నా నిర్వహించేందుకు ఏఐటీయూసీ యూనియన్ సన్నాహాలు చేస్తోంది. హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా సీఎల్‌సీ అధికారులు గుర్తింపు ఎన్నికలు నిర్వహించకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గడువు దాటగానే కోర్టు ధిక్కరణ కేసు

సకాలంలో ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ గతేడాది నవంబర్ 18న హైకోర్టు మెట్లు ఎక్కింది. దీనిపై పూర్వపరాలు పరిశీలించిన హైకోర్టు మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని సింగరేణి యాజమాన్యం, సీఎల్‌సీకి సూచించింది. ఈనెల 18తేదీలోగా హైకోర్టు ఇచ్చిన గడువు ముగియనుంది.

మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం



హైకోర్టు ఆదేశాల దిక్కరణపై తిరిగి హైకోర్టును ఆశ్రయిస్తాం. సింగరేణి యాజమాన్యం, సీఎల్‌సీ కోర్టు ఆదేశాలను పట్టించుకోవడం లేదు. ఈనెల 18వ తేదీతో కోర్టు ఇచ్చిన గడువు పూర్తి కానుంది. ఈలోగా సీఎల్‌సీ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించాలని నిర్ణయించాం. – వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి